PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్
# సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
మంగళవారం 06-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :126 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# ఏడాదిన్నరలోపు సర్వే పూర్తి..

## ప్రతి భూమికి భూధార్ నంబర్.. భూదార్ పేరుతో పాస్ పుస్తకాలు





ఏడాదిన్నరలో భూ సర్వే పూర్తి: మంత్రి పొంగులేటి.
ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయింపు.
'భూదార్' పేరుతో పాస్ పుస్తకాలు.
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం.
గిరిజన, గిరిజనేతర భూ సమస్యలపై ప్రత్యేక కమిటీ.
రాష్ట్రంలో 73 వేల గుడిసెలు గుర్తింపు.
అర్హులకు రెండో విడతలో ఇళ్ల మంజూరు.
దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్ల పూర్తి లక్ష్యం.

ఆదిలాబాద్: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూ సర్వేను చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో సమీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.రెవెన్యూ, సర్వే, హౌసింగ్, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 120 ఏళ్ల క్రితం రాష్ట్రంలో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం మళ్లీ మూడు విడతల్లో భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.

2లో

## మరో అయిదు కూనల జననం..
### భారత్‌లో 60కి పెరిగిన చీతాల సంఖ్య



2లో..

- కునో పార్కులో చీతా KGP21 ఐదు కూనలకు జన్మనిచ్చింది.
- భారత్‌లో మొత్తం చీతాల సంఖ్య 60కి చేరింది.
- ఇందులో 41 చీతాలు భారత్‌లోనే జన్మించాయి.
- KGP21 భారత్‌లో పుట్టి కూనలకు జన్మనిచ్చిన మూడో చీతా.



2లో..

## బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: రాహుల్

ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి దిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. దిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.



2లో..

## పేపర్ రిపోర్ట్ ఆధారంగా సీఈసీపై ఆదేశాలివ్వలేం: సుప్రీంకోర్టు

'సర్' అంశంపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

## సింగరేణిని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోంది: కవిత



2లో..

## అమెరికాలో సుప్రియ మృతిపై మంత్రి
# పొంగులేటి తీవ్ర విచారం

### అమెరికా రోడ్డు ప్రమాదంలో సుప్రియ మృతి.

- సుప్రియ మృతిపై మంత్రి పొంగులేటి విచారం.
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.
- మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు.
- సీఎం రేవంత్ దృష్టికి విషయం తీసుకెళ్లిన మంత్రి.
- కుటుంబాన్ని ఎంపీ రఘురాం రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.
- భారత రాయబార కార్యాలయంతో ఎంపీ సంప్రదింపులు.



ఏదులాపురం: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన దారం సుప్రియ (30) మృతి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణ వార్త గురించి తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుప్రియ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

2లో..



## గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి: సీఎం చంద్రబాబు

- గత ప్రభుత్వ విధ్వంసంతో పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి: చంద్రబాబు.
- గోదావరి-కృష్ణా నదుల అనుసంధానమే లక్ష్యం.
- గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమకు నీటి సమస్య ఉండదని వెల్లడి.
- రెండేళ్లలో రూ.30 వేల కోట్లతో 90 లక్షల కుటుంబాలకు తాగునీరు.
- గోదావరి పుష్కరాలకంటే ముందే పోలవరం పూర్తి చేస్తామని హామీ.
- రాయలసీమ అభివృద్ధికి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి.
- వివేకా హత్య కేసుపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్.
- ఉచిత ఇసుక ప్రజల హక్కు.. అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరిక.

మిగతాది 2లో

## AI ఇంటర్వ్యూలతో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి: లోకేశ్



మిగతాది 2లో

- 2029 నాటికి అన్ని పాఠశాలలు 4-స్టార్ స్థాయికి: లోకేశ్.
- కనీసం 1,000 స్కూళ్లు 5-స్టార్ స్థాయికి అభివృద్ధి.
- 7 వేల హైస్కూళ్లలో కంప్యూటర్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు.
- ఈ ఏడాది 5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ.
- నిరుద్యోగ యువతను స్కిల్ పోర్టల్‌లోకి తీసుకురావాలి.

## సింగరేణి కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్: కిషన్‌రెడ్డి



మిగతాది 2లో

# సంపాదకీయం

## బాధాసర్పదష్టుల సాహితీ బంధువు

“ఆ కూలిన ఇంటిలో ఏడుస్తున్నదెవరు? ఆమెకేమైంది?” అని అడిగాడు ఉపాధ్యాయుడు అఘోరనాథుడు. అందుకు తరగతిలో ఒక 11 ఏళ్ళ బాలుడు సమాధానమిస్తూ, “ఆమె ఒక పేదరాలు. ఇళ్లలో పాచిపని చేస్తూ గుడ్డి భర్తను చూసుకునేది. నిన్న రాత్రి ఆ భర్త పోయాడు. ఒంటరిదైపోయింది. అందువల్ల కుమిలి కుమిలి ఏడుస్తూ ఉంది. వీరు గొప్పింటి వారిలాగా దుఃఖాన్ని బిగ్గరగా ప్రదర్శించరు మాస్టర్ ముషాయ్!” అంటూ వయస్సుకు మించిన అనుభవజ్ఞునిలా, దుఃఖ నిర్వచనం చేశాడు. అప్పుడు అఘోరనాథుడు మనస్సులో “దుఃఖపు భిన్న రూపాల్ని గమనించగలిగిన ఈ బుడతడు పెద్దవాడయ్యాక మానవ మనస్తత్వ పరిశీలనలో ప్రసిద్ధికెక్కుతాడు” అని అనుకున్నాడు. బెంగాలీ సాహిత్య వినీలాకాశంలో చల్లని పున్నమి చంద్రునిలా భాసిల్లి, బాధిత హృదయాల కన్నీటి గాథలను కరుణ రసాత్మకంగా చిత్రీకరించిన శరత్ చంద్ర ఛటర్జీయే ఆ బాలుడు. ఒక్క బెంగాలీలనే కాక అన్ని దేశ భాషల పాఠక జన హృదయాలను కదిలించి, ద్రవింపజేసి మహా రచయితగా నీరాజనాలందుకున్నాడు. శరత్ తన కథల్లో జీవితపు అనేక విషయాలతోపాటు నైతిక మాతృత్వం అనే ఉన్నత భావనకు హృద్యంగా జీవం పోశాడు. స్త్రీ జీవితం సార్థకం, పరిపూర్ణం అయ్యేది సొంత బిడ్డలను కని, మాతృత్వాన్ని అనుభవించడమని చాలామంది భావిస్తారు. ఎంతోమంది స్త్రీలు కూడా అలానే ఆలోచించే మనోధర్మానికి భిన్నంగా శరత్ తన రచనల్లో మాతృత్వం అనేది రక్తసంబంధానికి మాత్రమే పరిమితమైనది కాదు, ఎవరైతే పేగుబంధంలేని ఇతరుల పిల్లలపై కూడా మమత, ప్రేమ, అప్యాయతలను కురిపిస్తారో వారు నిజమైన మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తారని చెబుతాడు. ఇలాంటి మాతృత్వం నుండి పెల్లుబికే మమకారం స్వార్థం నుండి జనించినది కాదు. దీని వెనుక మంచీచెడుల, న్యాయాన్యాయాల స్పృహ ఉంటుంది. ఒకోసారి మనుష్యుల మధ్య భావోద్వేగాలు చెలరేగి, వివేకాన్ని కోల్పోయి, పరుషంగా మాట్లాడడం, అనుచితంగా ప్రవర్తించడం జరుగుతుంది. అది కొన్ని సందర్భాలలో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. శరత్ రాసిన ‘బిందుగారబ్బాయి’ కథలో పెద్ద కోడలు కొడుకును, చిన్న కోడలు తన సొంత బిడ్డగా ప్రేమిస్తుంది. ఆ పిల్లాడి పెంపకం విషయంలో కోడళ్ళు ఒకరినొకరు కోపంతో గట్టిగా వాదించుకొని, పంతాలకు--పట్టింపులకుపోయి, వేర్వేరు కాపురాలు పెడతారు. ఆ తరువాత వారిద్దరూ పశ్చాత్తాపం చెందినప్పుడు, పెద్ద కోడలుతో ఆమె భర్త ఇలా అంటాడు: “క్షమించడం నీవు నేర్చుకొనకపోతే నీ పెద్దరికానికి విలువేముంది?” ఇతరులను క్షమించ గలిగేవారే నిజంగా పెద్దవారని శరత్ అభిప్రాయం. ‘శ్రీకాంత్’ నవలను శరత్ ఆటో బయోగ్రఫీయని చాలామంది భావిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సాహితీవేత్త రోమారోలా, ఆ నవల మొదటి భాగం చదివి ప్రపంచ సాహితీ అగ్రగణ్యుల్లో శరత్ ఒకరని, నోబెల్ బహుమతికి అర్హుడని ప్రకటించాడు. ఈ నవలలో అన్నదా దీదీ, రాజ్యలక్ష్మి, అభయ, కమలలత ప్రధాన స్త్రీ పాత్రలు. ఒక్కొక్కరిది ఒక విషాద కథ. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం పతియే ప్రత్యక్ష దైవం. ఆ పతి దుష్టుడు, దుర్మార్గుడు, హంతకుడైనప్పటికీ అతని వెంట నడవాలి. ఈ నీతి సూత్రాన్ని మనోవాక్కాయకర్మగా నమ్మిన అన్నదా దీదీ, హంతకుడై పారిపోయి, తిరిగి పాములుపట్టే వాని వేషంలో వచ్చిన భర్త వెంట వెళ్ళిపోతుంది. ఎవడితోనో లేచిపోయిందనే అపవాదుతో సమా జానికి దూరంగా వెలివేయబడుతుంది. అష్టకష్టాలు అనుభవిస్తుంది. భర్త పాము కాటుకు బలై మరణించిన తరువాత ఎవరికి కనిపించకుండా పోతుంది. ఇక్కడ శరత్, ఒకవైపు మత శాస్త్రాలు బోధించే స్త్రీ పాతివ్రత్యానికి (జష్ట్రుర్‌ఈఎ) ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే సమాజంలో స్త్రీత్వం (ఖశీఝఅష్ట్రశీశీ) విలువను గుర్తించడం లేదని విచారిస్తాడు. మరో పాత్ర అభయను అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్త ఆమె మానాన వదలివేసి ఉద్యోగానికై బర్మా వెళ్ళిపోతాడు. ఆమె అదే గ్రామానికి చెందిన రోహిణీ బాబును తోడు తీసుకొని భర్తను వెతుక్కుంటూ బర్మా వెళుతుంది. అప్పటికే ఆ భర్త బర్మా స్త్రీని పెళ్లిచేసుకొని ఉంటాడు. అలా అభయ రావడాన్ని సహించలేని భర్త ఆమెను చాలా హింసిస్తాడు. భరించలేక అభయ తిరిగి రోహిణీబాబు వద్దకు వచ్చి ఉంటుంది. అది చూసి దిగ్భ్రాంతికి గురైన శ్రీకాంతబాబుతో అభయ “నేను కేవలం భార్యను అయినంత మాత్రాన ఆయన అనుమతి లేకుండా ఇంత సుదూరం రావడానికి సాహసించాను. వచ్చి ఆయన ఆనందానికి భంగం కలిగించాను. స్త్రీలలో ఇంతటి సాహసాన్ని ఏ పురుషుడు సహించలేడు. అందుకు శిక్ష ఇది” అని, కుడిభుజంపై పైట కొంగును తొలగించి చూపుతుంది. కొరడాతో కొట్టిన దెబ్బకు లోతుగా చీరుకుపోయి ఉంటుంది. “ఇలాంటి దెబ్బలు నీకు చూపలేని చోట్ల చాలా ఉన్నాయి. నా భర్త అతని బర్మా భార్యతో సుఖంగా జీవించుగాక! అందుకు నాకు అభ్యంతరం లేదు. అయితే నిన్ను ఒక విషయాన్ని అడగాలనుకుంటున్నాను. ఒక భర్త కొరడా బలంతో భార్యకుగల అన్ని హక్కులను కాలదన్ని, చీకటి రాత్రిలో ఆమెను ఒంటరిగా ఇంట్లోనుండి బయటకు గెంటివేస్తే, వేద మంత్రాల శక్తి వల్ల మాత్రమే ఆమె తన బాధ్యతలకు, విధులకు కట్టుబడి ఉండాలా?....ఈ అర్థం, పర్థం లేని మంత్రాలు ఉచ్చరించిన వెంటనే గాలిలో కలిసిపోయాయి. అసత్యాలుగా మారిపోయాయి. అయితే అవే పెళ్ళి ప్రమాణాలు నాకు సంకెళ్ళుగా మారాయి. వాటి బరువు అంతా నామీద మోపబడింది. ఎందుకు? నేను స్త్రీ కావడం వల్లనేకదా!... అలాంటి ఘోర నేరాన్ని చేసిన భర్తను సహించి, ఒక జీవచ్ఛవంలా పడి ఉండడమే భార్య అంతిమ ఆశయమా?....” ఇలా ఈ అభయ పాత్ర ద్వారా శరత్ దుష్టులైన భర్తల దూషణలకు, అవమానాలకు, తిరస్కారాలకు, హింసకు గురైన భార్యల తరఫున ప్రశ్నల కొడవళ్ళను సంధిస్తాడు. ఇక ఈ నవలలోని మిగతా స్త్రీ పాత్రలైన రాజ్యలక్ష్మి, కమలలత కూడా విధివంచితులే. వీరి పట్ల ఇంతటి కాఠిన్యాన్ని ప్రదర్శించిన సమాజ ఆలోచనలలో మార్పును కాంక్షిస్తాడు శరత్.

శరత్ రాజకీయ వైఖరి ఎల్లప్పుడూ గాంధీ మార్గానికి భిన్నంగా రాజీలేని విప్లవ పోరాట పంథాకు అనుకూలంగా ఉండేది. ప్రముఖ సాహిత్యవేత్తగానేగాక స్వాతంత్రోద్యమంలో పోషించిన క్రియాశీల పాత్ర వలన విద్యార్థులకు, విప్లవకారులకు ఆయన ఎంతో అభిమాన పాత్రుడయ్యాడు.

## ఏడాదిన్నరలోపు సర్వే పూర్తి..

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం మొదటి విడత సర్వే కొనసాగుతోందన్నారు.

భూ సర్వే కీలకమైన అంశమని, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం సర్వేను చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు భూ సర్వేను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించి, ‘భూదార్’ పేరుతో పాస్ పుస్తకాలు అందించే ప్రక్రియ చేపడతామని చెప్పారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను మందలించినట్లు తెలిపారు.

### రెండో విడతలో ఇళ్లు

రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలపై నిర్వహించిన పరిశీలనలో సుమారు 73 వేల ఇళ్లు/గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. వీటిలో అర్హులైన వారికి రెండో విడతలో ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లను అందించినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్లను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో రెండు విడతల్లో ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ప్రొద్దుటూరు: గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు (జష్ట్రుఅసతీఖఝఎబ) అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తామని.. ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ‘జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార’ పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడారు.

గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు

“గోదావరి-కావేరి నదుల అనుసంధానం నా కోరిక. కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు. రానున్న రెండేళ్లలో రూ.30వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు తాగునీరు ఇస్తాం. గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. వైకాపా హయాంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాలనలో పవన్‌కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాం. రాయలసీమ దశ, దిశ మార్చిన ప్రభుత్వం ఎన్డీయే. ఈ ప్రాంతానికి రెండేళ్లలో రూ.24వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా హయాంలో రాయలసీమకు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

### అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది

వివేకా హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలి. మద్యం కుంభకోణంలోనూ అన్ని వేళ్లూ ఆయన వైపే చూపిస్తున్నాయి. వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై జగన్ సమాధానం చెప్పాలి. ఉచిత ఇసుక ప్రజల హక్కు. అక్రమాలు జరిగితే ఎవరినీ వదిలిపెట్టం” అని చంద్రబాబు హెచ్చరించారు.

### కేంద్రం సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి: పవన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మళ్లీ పొడిగించుకున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ఆగిపోయిన కార్యక్రమాన్ని కేంద్ర పెద్దలను సంప్రదించి మళ్లీ పనులు చేసుకుంటున్నామని చెప్పారు. వైకాపా హయాంలో రూ.2700 కోట్లే ఖర్చు చేసి ఏ ప్రాజెక్టూ పూర్తిచేయలేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నీటి కొరత లేని ఉమ్మడి గోదావరిలోనూ రూ.6వేలకోట్లతో జేజేఎం పనులు చేపడతున్నామని వివరించారు. తాగునీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్ నిర్వహణ చాలా కీలకమన్నారు. వైకాపా హయాంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగక చాలా ఫిల్టర్ బెడ్‌లు దెబ్బతిన్నాయని పవన్ చెప్పారు.

## AI ఇంటర్వ్యూలతో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి: లోకేశ్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. 2029నాటికి అన్ని పాఠశాలలను 4-స్టార్ స్థాయికి తీసుకెళ్లాలని చెప్పారు. కనీసం వెయ్యి స్కూళ్లను 5-స్టార్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ఈ ఏడాది జీరో స్టార్ పాఠశాలలను వన్ స్టార్‌కు అప్‌గ్రేడ్ చేయాలని, ఏడాదిలోగా వన్ స్టార్ పాఠశాలలను 2 స్టార్‌కు చేర్చాలని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మంత్రి లోకేశ్ సోమవారం సమీక్ష నిర్వహించారు.

“ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. మౌలిక సదుపాయాల పురోగతికి డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలి. రాష్ట్రంలోని 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయి కంప్యూటర్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఈ ఏడాది 5 లక్షల మందికి శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలి” అని మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని యువతకు సూచించారు.

రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతీయువకుడిని స్కిల్ పోర్టల్‌లోకి తీసుకురావాలని లోకేశ్ ఆదేశించారు. ఏఐ ఆధారిత ఇంటర్వ్యూల ద్వారా వారి నైపుణ్యాలను గుర్తించి ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేయాలని సూచించారు. సీడాప్, ఓంక్యాప్ ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## సింగరేణిని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోంది: కవిత




మొదటిపేజీ తరువాయి

రెడ్‌హిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో కారుణ్య నియామకాలను క్రమంగా తగ్గిస్తూ సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ (టీఆర్‌ఎస్) కల్వకుంట్ల కవిత ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని కార్మికుల హక్కు అని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా కవిత హెచ్‌ఎంఎస్, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సింగరేణి భవన్ ముందు బైఠాయించారు. నినాదాలతో హోరెత్తించారు. సింగరేణి సీఎండీ వచ్చి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కవిత మాట్లాడుతూ.. సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా అనర్హులుగా (అన్‌ఫిట్) మారిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. సీఎండీ అందుబాటులో లేకపోవడంతో జీఎం గురుప్రసాద్, డీజీఎం భాస్కర్ వచ్చి నిరసనకారులతో మాట్లాడారు. న్యాయమైన హక్కులను యాజమాన్యం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. స్పందించిన కవిత రెండు నెలల గడువు ఇస్తున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు.

## మరో అయిదు కూనల జననం.. భారత్‌లో 60కి పెరిగిన చీతాల సంఖ్య

మొదటిపేజీ తరువాయి

భారత్ చేపట్టిన ‘ప్రాజెక్ట్ చీతా’లో మరో ముందడుగు. మన దేశంలోనే జన్మించిన 32 నెలల చీతా . మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో అయిదు కూనలకు జన్మనిచ్చింది. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ ఈ విషయాన్ని ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. దీంతో దేశంలో మొత్తం చీతాల సంఖ్య 60కు చేరినట్లు తెలిపారు. ఇందులో 41 చీతాలు భారత్‌లోనే జన్మించాయని చెప్పారు.

“భారత్‌లోనే పుట్టి.. కూనలకు జన్మనిచ్చిన చీతాల్లో ముఖి, కేజీపీ12 తర్వాత కేజీపీ21 మూడోది. ఈ అయిదు కూనల తండ్రి ఆఫ్రికాలోని బోట్స్‌వానాకు చెందిన మగ చీతా. దీంతో భారత్‌లోనూ బోట్స్‌వానా వంశక్రమం మొదలైంది. ప్రాజెక్టు చీతా (గ్రాతీశీయవఛ్జష్ట్రవమ్ఘుష్ట్ర)లో భాగమైన వెటర్నరీ వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది, నిర్వాహకులకు అభినందనలు” అని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. తొలిసారి 2022 సెప్టెంబరు 17న నమీబియా నుంచి తెచ్చిన ఎనిమిది చీతాలను ప్రధాని మోదీ.. కునో నేషనల్ పార్కులో వదిలారు.

## బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: రాహుల్

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన ‘ఎక్స్’ వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతో పాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు.

“మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి” అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కేంద్ర ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## పేపర్ రిపోర్ట్ ఆధారంగా సీఈసీపై ఆదేశాలివ్వలేం: సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఒక వార్తాపత్రిక కథనం ఆధారంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. మిగిలిన అధికారులకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వినియోగించుకోవచ్చా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామంది. అంతకంటే ముందు ఈ వార్తలపై ఎన్నికల సంఘం స్పందనను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఓట్ల తొలగింపు నిర్ణయాలను సీఈసీ ఏకపక్షంగా తీసుకున్నారని నిరూపిస్తే.. తదుపరి చర్యలకు ఆదేశిస్తామని పేర్కొంది.

ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. అందులో 2025 జూన్ నుంచి ఇప్పటిదాకా సర్‌లో భాగంగా... పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలగించిన 13 కోట్లకు పైగా ఓట్లపై సిట్ ద్వారా విచారణ జరపాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. సీఈసీ నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు.

క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలి: అత్యాచార ఘటనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

సర్ ప్రక్రియలో భాగంగా ఓట్ల తొలగింపు, చేర్పులపై గత 10 నెలల్లో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సంధూ, జోషి అభ్యంతరాలు వ్యక్తంచేశారని ఇటీవల జాతీయ మీడియాలో కథనం వెలువడింది. దీంతో సీఈసీ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, విద్యార్థి నేతలు, సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది.

ఫారం 6లో మార్పులపై..

కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఉపయోగించే ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. 2025లో ఈ ఫారంలో ప్రవేశపెట్టిన అనుబంధ పత్రంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలపడం గమనార్హం.

## అమెరికాలో సుప్రియ మృతిపై మంత్రి పొంగులేటి తీవ్ర విచారం

మొదటిపేజీ తరువాయి

ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి సూచన మేరకు ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం సింహాద్రినగర్‌లోని సుప్రియ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పారు.

ఫోన్‌లో ఓదార్చిన ఎంపీ రఘురాం రెడ్డి

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి ఫోన్ చేసి మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడించగా.. బాధిత కుటుంబాన్ని ఎంపీ ఓదార్చారు. అలాగే, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ ఉన్నతాధికారులను సంప్రదించానని, వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు రఘురాం రెడ్డి తెలిపారు.

## సింగరేణి కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దసరా, దీపావళి పండగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి (ఖఱంష్ట్రుఅ =వ‌ఎ‌వఎ) తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ‘ఎక్స్’ వేదికగా కొనియాడారు. సింగరేణి అనేది బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమన్నారు. లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని కొనియాడారు.

“రాష్ట్ర, దేశ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామి. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం సింగరేణి యాజమాన్యం పనిచేయాలి. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సంస్థకు ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి. కార్మికులకు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు” అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రేపు గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

**మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రేపు మెదక్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే భారీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రామాయంపేట--సిద్దిపేట మధ్య ఎన్‌హెచ్-765డీజీ వెంట అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించడంతో పాటు పచ్చదనం, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గవర్నర్ మధ్యాహ్నం 2.30



గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుని 2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే 'నషా ముక్త్ భారత్' ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని, 2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమవుతారని, నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో భేటీ అవుతారని వివరించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరి సాయంత్రం 3.30 గంటలకు అమోఘ్ హోటల్ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గవర్నర్ పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు ఐడీఓసీలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి జోజి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమాభార్గవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పట్టపగలే ఇసుక దందా నడుస్తున్నా పట్టించుకోని అధికారులు!

**మెదక్ జిల్లా, సందేశం టైమ్స్ ప్రతినిధి, అక్టోబర్ 6:**



కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామ శివారులోని మంజీరా నది పరివాహక ప్రాంతంలో పట్టపగలే ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం కనిపించింది. ఇసుకను ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నదిలో ఇసుక తరలింపునకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లయితే తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎండిన వరి పంటలను పరిశీలించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

- గంగాయిపల్లి తండాలో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం



**శివంపేట, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి):**
మెదక్ జిల్లా శివంపేట మండలం గంగాయిపల్లి తండాలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తండాలో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. తండా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో బీటీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తండా పరిధిలోని వ్యవసాయ పొలాలను సందర్శించారు. ఎండిపోయిన వరి పంటలను స్వయంగా పరిశీలించి రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పంటలు ఎండిపోవడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిశీలించారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే భువనగిరి నుంచే ఉద్యమం ఉధృతం చేస్తాం

- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ హెచ్చరిక

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 5 (సందేశం టైమ్స్):**
అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భువనగిరి నుంచే వికలాంగుల ఐక్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ హెచ్చరించారు. సోమవారం వికలాంగుల ఐక్య సంఘాల ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డితో కలిసి హాజరైన గిద్దె రాజేష్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. వికలాంగుల పింఛన్‌ను వెంటనే రూ.6 వేలకు పెంచాలని, అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల






బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వికలాంగుల హక్కుల చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి వికలాంగుల సంక్షేమ శాఖను వేరుచేసి ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలని, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే భువనగిరి నుంచే రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల ఐక్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వికలాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐక్య సంఘాల నాయకుడు కొడిదల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో బీజేపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ గొల్లి ప్రభాకర్, ఎన్‌పీఆర్‌డీ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, ఐక్య సంఘాల నాయకులు మచ్చ ఉపేందర్, అనంతుల ఎల్లారెడ్డి, సింగారం రమేష్, జాగిలపురం అయిలయ్య, బండారి శివకుమార్, సిద్ధారెడ్డి, గుజ్జ అశోక్, గోగు యాదయ్య, ఆకుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# 161 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడు మృతి





**నారాయణఖేడ్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా పరిధిలోని 161 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వెళు న్న కారు, మరోవైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సూర్ణ భాను (25) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం భానును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు సూర్ణ బీరప్ప, నాగవ్వ దంపతుల కుమారుడు. భానుకు ఆరు నెలల క్రితమే జ్యోతితో వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం హోండా షైన్ (టూ 08 రా 8875)గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.
18

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా ఆలకించి, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన



ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కలెక్టరేట్‌కు 53, సంగారెడ్డి డివిజన్‌కు 22, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు ఒక వినతి అందగా, అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు అండగా ఉంటాం





**ఖమ్మం టౌన్, అక్టోబర్ 6(సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మార్నింగ్ వాక్ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న యువతను బీఆర్ఎస్ నాయకుడు రాకేష్ రెడ్డి కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగార్థులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, మూడు సింహాల పోలీస్ టోపీ తమ తలపై పెట్టుకోవాలనే యువత తపన తనను వారికి మరింత చేరువ చేసిందన్నారు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల, వయోపరిమితి పెంపు కోసం పోలీస్ ఉద్యోగార్థులతో కలిసి చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రాక్టీస్‌లో ఎదురవుతున్న సమస్యలను యువత తన దృష్టికి తీసుకురాగా, సాధ్యమైనంత మేరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లాంగ్ జంప్ ప్రాక్టీస్‌కు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇసుకను త్వరలో ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అలాగే లాంగ్ జంప్ డిస్టెన్స్ విషయంలో అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, శారీరక దేహదారుఢ్య పరీక్షల్లో ఉన్న అంశాలను అధ్యయనం చేసి పరిష్కారం దిశగా ఆలోచన చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వల్ల వేలాది మంది యువత నిరాశకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఉద్యోగాల కోసం కష్టపడుతున్న ప్రతి యువకుడికి న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే వచ్చే నెలల్లో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు రాకేష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయాలి.. ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి




**ఖమ్మం, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్):**
ప్రతి అర్హుడైన పట్టభద్రుడి ఓటు నమోదు జరిగేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమలరాజు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్‌ను సాధారణ కార్యక్రమంగా కాకుండా ప్రత్యేక కార్యాచరణగా తీసుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. మధిర నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి ఓటు నమోదు పూర్తయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరుద్యోగులు, ఉద్యోగుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందనే భావన ప్రజల్లో నెలకొందని లింగాల కమలరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతతో పాటు వివిధ వర్గాల్లో ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు జరిగేలా కృషి చేయాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి బలమైన మద్దతు సమీకరించవచ్చని తెలిపారు. ఒక్క అర్హుడైన పట్టభద్రుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగలకూడదని, ప్రతి కార్యకర్త ఈ ప్రక్రియను బాధ్యతగా తీసుకుని ఎన్‌రోల్‌మెంట్‌ను పూర్తి చేయాలని లింగాల కమలరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత**

**సంగారెడ్డి, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్):**
తెలంగాణ సమాచార కమిషన్ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వారోత్సవాలు--2026 నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం--2005పై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలలో సంబంధిత శాఖలు, పబ్లిక్ అథారిటీల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 9న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏపీఐఓలు, పీఐఓలు, ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్టీఐ వారోత్సవాలను




సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్ కన్వీనర్‌గా గోల్కొండ సాయి కృష్ణ ఎన్నిక

**దుబ్బాక, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో దుబ్బాకలో నిర్వహించిన సమావేశంలో గోల్కొండ సాయి కృష్ణను ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో కూడిన ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గోల్కొండ సాయి కృష్ణ మాట్లాడుతూ సాధారణ కార్యకర్తగా తన ప్రయాణాన్ని ప్రారంభించి మండల స్థాయి నాయకుడిగా, అనంతరం జిల్లా స్థాయి నాయకుడిగా ఎదుగుతూ విద్యారంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించానన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ కేసులకు, ఇబ్బందులకు భయపడకుండా ముందుకు సాగుతున్నానని తెలిపారు. విద్యార్థుల సమస్యలనే తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాడుతున్న తనకు ఉమ్మడి మెదక్ జిల్లా హాస్టల్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తానని, హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ ఉమ్మడి మెదక్ జిల్లా శాఖ




నాయకులకు, కార్యకర్తలకు గోల్కొండ సాయి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# చౌటకూర్‌లో సీసీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన**



**చౌటకూర్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి డి. రమేష్):**
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో సీసీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు వేగం పుంజుకుంది. ఇందులో భాగంగా చౌటకూర్ గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్కల్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ అధికారి జగదీశ్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**సంగారెడ్డి, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీశ్ జన్మదిన వేడుకలను బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుకూరి జగదీశ్వర్‌తో పాటు సంగారెడ్డి జిల్లా బీసీ యువత అధ్యక్షుడు రమేష్ కుమార్, సంగారెడ్డి నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు లాడే బాలు, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ ఉద్యమ నాయకులు పాల్గొని జగదీశ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీసీ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతో పాటు బీసీల అభ్యున్నతికి, విద్యార్థుల సంక్షేమానికి జగదీశ్ చేస్తున్న సేవలను నాయకులు అభినందించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. బీసీ సంక్షేమం, విద్యార్థుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఆయన మరింతగా సేవలందించాలని కోరారు.

# ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

**డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్**





**మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భూభారతికి సంబంధించి 24, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 15, పెన్షన్లకు 3, ఇతర సమస్యలకు సంబంధించి 37 దరఖాస్తులు కలిపి మొత్తం 79 అర్జీలు స్వీకరించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఏవో యూనస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి: అదనపు కలెక్టర్ నగేష్**





**మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి):**
జిల్లాలో పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై వ్యాపారులు, సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా ఏఈఓలు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించిందని తెలిపారు. మెదక్ జిల్లాలో 39,940 ఎకరాల్లో పత్తి సాగు కాగా సుమారు 3,95,280 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఏఈఓలు రైతుల పంట వివరాలను కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేయాలని, రైతులు స్లాట్ బుక్ చేసుకున్న రోజే పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తూనికలు, కొలతల అధికారులు వేబ్రిడ్జిలు, వెయింగ్ స్కేల్స్‌లో ఎలాంటి తూకం వ్యత్యాసాలు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లులు, గోదాముల వద్ద నీటి వసతులు, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిని మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లులకు తీసుకొచ్చే ముందు తేమ శాతం తగ్గేలా ఆరబెట్టుకోవాలని, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీల ద్వారా పత్తిని తరలించే సమయంలో నిబంధనలు పాటించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, మార్కెటింగ్ అధికారి బాలరాజు, తూనికలు కొలతల శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారి వేణు, డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



**సంగారెడ్డి: సందేశం టైమ్స్ ప్రతినిధి అక్టోబర్ 6**
సంగారెడ్డి పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని శ్రీరామ మందిరంలో శ్రీరాముల కల్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో కల్యాణోత్సవ కార్యక్రమాన్ని జరిపించారు. శ్రీరాముని జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ - ఓటు హక్కు రక్షణ కోసం చలో కలెక్టరేట్

**ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకుల పిలుపు**




**సంగారెడ్డి, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఏఐసీసీ, పీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై నాయకులు సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 6, మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం చేపట్టబోయే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నాయకులు కోరారు.

# 'మద్దతు' మాకొద్దు.. మార్కెట్ ధరే ముద్దు!

**- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలతో కొనుగోలు కేంద్రాలపై రైతుల అనాసక్తి**



**నిజామాబాద్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):ఠ**
ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర, సన్న రకాల ధాన్యానికి అందిస్తున్న బోనస్ కంటే బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తుండటంతో రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. సన్న రకాల ధాన్యానికి ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర లభిస్తుండటంతో పలువురు రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధరగా ప్రకటించగా, సన్న రకాల ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ కలిపి గరిష్ఠంగా రూ.2,961 వరకు లభించే అవకాశం ఉంది. అయితే బహిరంగ మార్కెట్‌లో దీనికంటే అధిక ధరలు వస్తుండటంతో బోనస్ ఆకర్షణ తగ్గింది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సుమారు 7.50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, నిజామాబాద్ జిల్లాలో 4.30 లక్షలు, కామారెడ్డి జిల్లాలో 3.20 లక్షల ఎకరాల్లో పంట సాగవుతోంది. ఈ సీజన్‌లో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానికంగా ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్దకే వెళ్లి పొలాలు, కల్లాల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు వెంటనే చెల్లింపులు చేస్తుండటం కూడా రైతులను ఆకర్షిస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, తూకం, రవాణా తదితర ప్రక్రియలు ఉండగా, ప్రైవేటు కొనుగోళ్లలో ప్రక్రియ త్వరగా పూర్తవుతుండటంతో సమయం, రవాణా ఖర్చులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వ్యాపారులు కూడా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే కోతలు వేగం పుంజుకుని మార్కెట్‌కు భారీగా ధాన్యం వచ్చిన తర్వాత ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ధాన్యానికి ఉన్న డిమాండ్, మార్కెట్‌లో కొనసాగుతున్న ధరలపై రైతులు, వ్యాపారులు, అధికారులు దృష్టి సారించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు అనుకూలంగా ఉండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎంత మొత్తంలో ధాన్యం వస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఫిర్యాదుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలి



**మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూవివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆయన ఆదేశించారు.

## ఈ నెల 6న మెదక్ జిల్లాలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పర్యటన



**మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకోనున్న గవర్నర్, 2.40 గంటలకు ఐడీఓసీ ఆవరణలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించే 'నషా ముక్త్ భారత్' ర్యాలీని ప్రారంభించనున్నారు. అనంతరం ఐడీఓసీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం కానున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరనున్న గవర్నర్, సాయంత్రం 3.30 గంటలకు అమోఘ్ హోటల్ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్దకు చేరుకుంటారు. మెదక్ ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించే సుమారు 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. అనంతరం సాయంత్రం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు



**సూర్యాపేట, అక్టోబర్ 6(సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):**
సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ప్రతి ఫిర్యాదుపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన పోలీసు సేవలను అందించడంతో పాటు తక్షణ సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు తలెత్తినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరువర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
06-10-2026

# ఉజ్వల లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ

5 కిలోల సిలిండర్లకూ దామాషా ప్రకారం ప్రయోజనం



న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్): ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ అందుతోంది. 14.2 కిలోల సిలిండర్‌కు ఒక్కో రీఫిల్‌పై రూ.300 చొప్పున, సంవత్సరానికి గరిష్ఠంగా 9 రీఫిల్స్ వరకు ఈ లక్ష్యిత సబ్సిడీని 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 5 కిలోల సిలిండర్లకు కూడా దామాషా ప్రకారం సబ్సిడీ వర్తిస్తుంది. ఈ సబ్సిడీ అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజనను 2016 మేలో ప్రారంభించారు. పేద కుటుంబాలకు చెందిన వయోజన మహిళలకు డిపాజిట్ రహిత ఎల్పీజీ కనెక్షన్ అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. 2026 మే నాటికి దేశవ్యాప్తంగా 10.57 కోట్లకు పైగా ఉజ్వల ఎల్పీజీ కనెక్షన్లు అందించినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్‌తో పాటు స్టవ్, తొలి రీఫిల్‌కు సంబంధించిన ప్రయోజనాలు కూడా నిబంధనల ప్రకారం అందుతున్నాయి. అదనంగా, ఉజ్వల పథకం కింద 25 లక్షల కొత్త ఎల్పీజీ కనెక్షన్లను మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆమోదం తెలిపింది. ఈ కనెక్షన్ల ద్వారా మరింత మంది అర్హులైన మహిళలకు వంటగ్యాస్ సౌకర్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# హరిద్వార్ యోగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆర్మూర్ యోగా శిక్షకులు

- యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
- పతాంజలి యోగ సమితి ధోండి జయరాజ్ యోగా మాస్టర్ వారి ఆధ్వర్యంలో హరిద్వార్ కి వెళ్లడం జరిగింది.



అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పతంజలి యోగ పీఠ్ హరిద్వార్ భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి రాందేవ్ బాబా చే "ముఖ్య యోగ శిక్షక్ శిబిరం" హరిద్వార్ యోగ పీఠ్ నందు నిర్వహించినారు. తెలంగాణ నుండి మొత్తము 56 మంది పాల్గొన్నారు. నిజామాబాదు జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్టు కార్యవర్గం జిల్లా ప్రభారి శ్రీ సాయన్న , బుచ్చన్న మరియు గుండ రంజిత్ గారి మార్గదర్శకంలో మొత్తం 16 మంది పాల్గొనగా జయరాం,పతంజలి యోగ కేంద్రం ఆర్మూర్ ద్వారా కొండ గంగాధర్, బి కే యోగేష్, బిఎస్ శ్రీనివాస్, బొబిడే చంద్రశేఖర్, మరియు ఎ.అనిల్ గౌడ్ 5 గురు పాల్గొన్నారు.హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠంలో యోగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ ఐదు మంది శిక్షకులు గురువు స్వామి రాందేవ్ బాబా గారిని కలిసి ఆయన వద్ద శిక్షణ పొంది, ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా రాందేవ్ బాబాని కలవడం, ఆయన ఆశీస్సులు పొందడం తమకు ఎంతో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని శిక్షకులు తెలిపారు.యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించి, తాము నేర్చుకున్న యోగ విద్యను సమాజానికి ఉపయోగపడే విధంగా అందించాలనే సంకల్పంతోనే ఈ శిక్షణకు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు.ఈ శిక్షణ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని ఆర్మూర్ తిరిగి వచ్చిన సందర్భంగా యోగా శిక్షకులు ఆనందం వ్యక్తం చేశారు. తమను హరిద్వార్‌కు పంపించి, శిక్షణ పొందే అవకాశం కల్పించిన జయరాం జీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ యోగా శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ఆర్మూర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు అందిస్తూ, మరింత మందిని యోగా వైపు ప్రోత్సహించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తమ వంతు సేవ అందిస్తామని వారు తెలిపారు.ఈ యోగా శిక్షణా ప్రయాణం విజయవంతంగా పూర్తవడంతో పతంజలి కుటుంబ సభ్యులు, యోగా శిక్షకులు, అభ్యాసకులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

# పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నర్సాపూర్ పోలీసులు

నర్సాపూర్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని గుర్య తండాకు చెందిన వంకదోత్ గోపాల్ (32) పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటనపై నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోపాల్‌కు సుమారు 15 సంవత్సరాల క్రితం రాజితతో వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా గోపాల్ మద్యానికి అలవాటుపడి కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల భార్యతో గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లినట్లు



పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 3న ఉదయం సుమారు 6 గంటలకు వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన కాత్రోత్ జ్యోతి, సంతోష్ వ్యవసాయ పొలాలకు వెళ్తుండగా ప్రమీలకు చెందిన పొలంలో గోపాల్ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద పురుగుల మందు ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే గోపాల్‌ను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్టోబర్ 5న తెల్లవారుజామున 1:49 గంటలకు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ప్రాథమిక సమాచారం ప్రకారం గోపాల్ పురుగుల మందు సేవించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఘటనపై నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఎన్‌హెచ్ఎం విభాగంలో 64 పోస్టులకు నోటిఫికేషన్

మెదక్, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో మొత్తం 64 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఆర్.బి. గణేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్, హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మరియు స్టేట్ మిషన్ డైరెక్టర్, ఎన్‌హెచ్ఎం ఆదేశాల మేరకు డి. ఎం. ఆర్. సి. నెం.106/ఏ4/ఎస్.పి.ఎం.యు/ఎన్‌హెచ్ఎం/2026, తేదీ 31-08-2026 ప్రకారం ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఖాళీలలో ఎం.ఎల్.హెచ్.పి/సిహెచ్ఓ/మెడికల్ ఆఫీసర్ 10, ల్యాబ్ టెక్నీషియన్ 2, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఫిజియోథెరపిస్ట్/ఆక్యుపేషనల్ థెరపిస్ట్ 1, స్టాఫ్ నర్స్ 23, స్టాఫ్ నర్స్ 3, ఏఎన్ఎం 10, ల్యాబ్ టెక్నీషియన్ 2, ఫార్మాసిస్ట్ 2, స్టాఫ్ నర్స్ 5, ఫార్మాసిస్ట్ 3, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ 1, టీబీహెచ్‌వీ 1 పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్, ఇతర వివరాల కోసం మెదక్ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా 2026 అక్టోబర్ 6 నుంచి అక్టోబర్ 14



వరకు కార్యాలయ పని దినాల్లో, పని వేళల్లో సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఐడీఓసీ ప్రాంగణం, మెదక్‌లో స్వయంగా సమర్పించాలని డీఎంహెచ్ఓ డా. ఆర్.బి. గణేశ్వర్ తెలిపారు.

# ఆధార్ అప్‌డేట్ పేరుతో 20 గుంటల భూమి బదలాయింపు.. అల్లుడిపై వృద్ధురాలి ఆరోపణలు

కోదాడ, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆధార్ కార్డులో మార్పులు చేయిస్తానని నమ్మించి తనను వెంట తీసుకెళ్లి, తనకు తెలియకుండానే 20 గుంటల వ్యవసాయ భూమిని మనవరాలి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన రాములమ్మ ఆరోపించారు. తన ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయిస్తానని అల్లుడు రాములు తనను వెంట తీసుకెళ్లాడని, అయితే అనంతరం తనకు సంబంధించిన భూమి మనవరాలు వినీత పేరుపై బదలాయించినట్లు తెలిసి షాక్‌కు గురయ్యానని ఆమె ఆవేదన



వ్యక్తం చేశారు. తనకు చదువు లేకపోవడంతో పత్రాల్లోని వివరాలు పూర్తిగా అర్థం కాలేదని, ఆధార్ మార్పు కోసం వెళ్తున్నాననే ఉద్దేశంతోనే వెళ్లానని రాములమ్మ తెలిపారు. తనకు తెలియకుండా భూమి బదలాయింపు జరిగిందని ఆరోపిస్తూ భూమిని తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ వ్యవహారంపై ఆమె కోదాడ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ సమయంలో ఆమె సమ్మతి తీసుకున్నారా, పత్రాలపై సంతకం లేదా వేలిముద్ర ఎలా తీసుకున్నారు, ఆధార్ అప్‌డేట్ పేరుతో తీసుకెళ్లారన్న ఆరోపణల్లో వాస్తవమెంత అనే అంశాలపై అధికారుల విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సంబంధిత ఆధార్ వివరాలను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని రాములమ్మ కోరుతున్నారు.

# నూతన కమిటీతో అధికారులకు ఎమ్మార్పీఎస్ మర్యాదపూర్వక సన్మానం

చింతకాని, అక్టోబర్ 6 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కెట్టి సురేష్): చింతకాని మండలంలో ఇటీవల జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు మండల అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. నూతన మండల అధ్యక్షుడు నారపొంగు నాగేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అల్తాఫ్, సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేష్, వ్యవసాయ అధికారి సతీష్, ఏపీఓ నాగ పుల్లారావులను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన మండల కమిటీ సభ్యులను అధికారులకు పరిచయం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. మండల అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందేలా సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల సీనియర్ నాయకులు పగిడిపల్లి రవీంద్ర, వేల్పుల హరికృష్ణ, కుక్కల దిలీప్, జొన్నలగడ్డ పుల్లారావు, గుండ్ల రాంబాబు, కోట వెంకటరత్నం, జిల్లపల్లి మధు, అండే గోపీనాథ్, పగిడిపల్లి పెద్ద బాలస్వామి తదితరులు



పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో నందిగామకు అభివృద్ధి జోరు

**– రూ.2.50 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
నందిగామ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిగామ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారునందిగామ మండలం చందాపురం క్రాస్ రోడ్ వద్ద ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.2.50 కోట్ల నిధులతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు కూటమి నేతలు అధికారులతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా ఇంప్రూవ్మెంట్స్ ౼శీ రైడింగ్ సూరపేస్ నందిగామ -పొఖునూరు రోడ్ ఫ్రొం ౘ1.2.000 ౼శీ 5.000 ఖఅ౹ 14.000 ౼శీ 19.730 ఱఅ ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ పనులు చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ప్రయాణ సమయం ఇబ్బందులు తగ్గనున్నాయి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రోడ్లు తాగునీరు విద్య వైద్యం సాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు
కూటమి ప్రభుత్వం నందిగామ అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు కార్యక్రమంలో కూటమి నేతలు ఆర్అండ్‌బీ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# జడ్పీ.హెచ్. స్కూల్ నందిగామ ఎస్.ఎం.సి. (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ)

**– ఎన్నికల అవకతవకలపై విధ్యా శాఖ అధికారులు సమగ్ర విచారణ చేయాలని బిజెపి సైదా డిమాండ్**




(సందేశం టైమ్స్ ప్రతినిధి):
జడ్పీ.హెచ్. స్కూల్ నందిగామ ఎస్.ఎం.సి. (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) ఎన్నికలు పారదర్శకంగా జరిపించాలి ఎస్.ఎం.సి. ఎన్నికల అవకతవకలపై విధ్యా శాఖ అధికారులు సమగ్ర విచారణ చేయాలని బిజెపి సైదా డిమాండ్ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణం లో గల జడ్పీ హెచ్ స్కూల్ లో ఇటీవల జరిగిన ఎస్.ఎం.సి(స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) ఎన్నికల ఏకగ్రీవాల పై విధ్యా శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి ఎన్నికలు పారదర్శకంగా జరిపించాలని బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు బీజేపి సైదా డిమాండ్ చేశారు విధ్యార్థిని విధ్యార్థుల తల్లిదండ్రులు మరియు కమిటీ సభ్యుల అభిప్రాయాలు అంగీకారాన్ని పరిగణలోకి తీసుకోకుండానే ప్రధానోపాధ్యాయురాలు తనకు అనుకూలమైన వ్యక్తిని ఛైర్మన్ గా ఏకపక్షంగా ఏకగ్రీవం చేశారని ప్రధానోపాధ్యాయురాలు పై చర్యలు తీసుకోవాలని బిజెపి సైదా డిమాండ్ చేశారు ఈ విధంగా ఏకపక్షంగా జరిగిన ఎస్ఎంసి ఛైర్మన్ ఏకగ్రీవాన్ని బిజెపి సైదా ఖండించారు జడ్పీ హెచ్ స్కూల్ నందిగామ లో ఎస్.ఎం.సి. ఎన్నికల పై పత్రికలు టీవీ ల లో వచ్చిన వార్తను తాను చూశానని అందుకే ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా ఉండాలని ఉద్దేశంతోనే మళ్లీ ఎన్నికలు జరిపించాలని ప్రభుత్వానికి తెలియజేస్తున్నానని బిజెపి సైదా అన్నారు ఈ విషయమై విచారణ చేసి ఎన్నికలు పారదర్శకంగా జరపకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అందువలన మళ్లీ ఎస్.ఎం.సి. ఎన్నికలు జరపాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బిజెపి సైదా ప్రభుత్వాన్ని హెచ్చరించారు

# దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి.. లారీలతో రహదారి దిగ్బంధం...!

**– సి ఎస్ పి కాట వద్ద ప్రజల ప్రాణాలతో చెలగాటమా...?**

**– ప్రధాన రహదారికి ఇరువైపులా లారీల నిలుపుదలతో ప్రమాద ముప్పు**

**– బొగ్గు ధూళితో ప్రజారోగ్యానికి ముప్పు.. అధికారుల పర్యవేక్షణ ఏది...?**

**– ఓల్డ్ స్టోర్‌లో పార్కింగ్ ఉన్నా రోడ్డుపైనే లారీల మకాం...!**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
మణుగూరు సి ఎస్ పి కాట సమీపంలోని ప్రధాన రహదారి ప్రజలకు నరకప్రాయంగా మారిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు భారీ వాహనాల రాకపోకలు.. మరోవైపు రహదారికి ఇరువైపులా లారీల నిలుపుదల.. దీనికితోడు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, బొగ్గు ధూళి. వాహనం కదిలితే చాలు దుమ్ము మేఘంలా ఎగిసిపడి రహదారిని కమ్మేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.
దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం నెలకొంది.

**ప్రధాన రహదారేనా.. లారీ పార్కింగ్ స్థలమా...?**

అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రహదారికి ఇరువైపులా లారీలను నిలిపివేయడంతో రోడ్డుకు అందుబాటులో ఉన్న వెడల్పు తగ్గిపోతోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు ఇతర అత్యవసర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది.

**పార్కింగ్‌కు స్థలం ఉన్నా.. రోడ్డుపైనే లారీలు ఎందుకు...?**

లారీల పార్కింగ్ కోసం సింగరేణి యాజమాన్యం ఓల్డ్ స్టోర్ ప్రాంతంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రధాన రహదారిపైనే లారీలను నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక పార్కింగ్ ప్రాంతం ఉన్నప్పుడు రహదారిని పార్కింగ్ స్థలంగా మార్చాల్సిన అవసరం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారిపై లారీలు నిలిపివేయకుండా సింగరేణి సెక్యూరిటీ విభాగం, పోలీస్ శాఖ సమన్వయంతో కఠినమైన పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**దుమ్ము కాదు.. ప్రజారోగ్యంపై దాడి...!**

రోడ్డుపై పేరుకుపోయిన బొగ్గు ధూళి, మట్టి, దుమ్ము వాహనాల రాకపోకలతో గాలిలో కలుస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిరంతరం దుమ్ము ఎగిసే పరిస్థితిని కేవలం ట్రాఫిక్ సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, రహదారి భద్రతకు సంబంధించిన అత్యవసర సమస్యగా అధికారులు పరిగణించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సామాజిక బాధ్యత కలిగిన పౌరుడు కర్నే బాబురావు సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా మణుగూరు ఎంపీడీఓ కు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

**అధికారులకు స్పష్టమైన డిమాండ్లు**

సి ఎస్ పి కాట సమీపంలోని ప్రధాన రహదారిపై క్రమం తప్పకుండా నీటిని చల్లి దుమ్ము ఎగరకుండా చూడాలని కోరారు. రహదారిపై పేరుకుపోయిన దుమ్ము, బొగ్గు ధూళి, మట్టిని యంత్రాల సహాయంతో నిరంతరం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రహదారికి ఇరువైపులా లారీలను ఇష్టానుసారంగా నిలిపివేయకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఓల్డ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపాలిటీ, పోలీస్, ట్రాఫిక్, సింగరేణి యాజమాన్యం, సెక్యూరిటీ విభాగం మరియు సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేసి, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్బంధ రహిత మార్గం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. "ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలి. దుమ్ము, లారీ పార్కింగ్ సమస్యలకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి" అని కర్నే బాబురావు కోరారు.



10

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికే టీజేఎంయూ పోరాటం

**– 8న జరిగే అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభను విజయవంతం చేయండి**

**– ఏర్పాట్లను పరిశీలించిన యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
అశ్వారావుపేట జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ ( టజేఎంయు) నిరంతరం అండగా నిలుస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీన అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో జరగనున్న టీజేఎంయూ అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభ ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇనపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తే ఏకైక మార్గమన్నారు. రాష్ట్రంలో బలమైన సంఘాలుగా చెప్పుకుంటున్న పలు యూనియన్లు స్వార్థ ప్రయోజనాలు, వ్యక్తిగత కార్యకలాపాలకే ప్రాధాన్యతనిస్తూ జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. ఫలితంగా నేటికీ పాత్రికేయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సొంతింటి కలను కూడా నెరవేర్చుకోలేక జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్ యు జె ఐ) అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ పాత్రికేయుల గొంతుకగా నిలిచి రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 8వ తేదీన ప్రథమ మహాసభకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పాత్రికేయులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ రాఘవేంద్ర, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, అశ్వారావుపేట నాయకులు నూనె హనుమంతరావు, పెనుగొండ సత్యనారాయణ, నార్లపాటి సుబ్బారావు, రాము తదితరులు పాల్గొన్నారు.



# ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలి..

**–పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై ఆయన సమీక్షించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, డీఎంహెచ్ఓ పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీ లు అమలు చేసేది ఎప్పుడు.

## గిద్దె రాజేష్. బి వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని భువనగిరి నుంచే భూస్థాపితం చేస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో బీ వి హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఘాటు వ్యాఖ్యలు అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని భువనగిరి నుంచే భూస్థాపితం చేస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు సోమవారం వికలాంగుల ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తో కలిసి హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు వికలాంగులకు మేనిఫెస్టోలో అనేకమైన హామీలను ఇచ్చి వికలాంగుల సమాజాన్ని నమ్మబలికి వికలాంగుల ఓట్లతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అడుగడుగున వివక్ష ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి మూడేళ్ల పరిపాలన పూర్తి కావస్తున్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని నేటి వరకు నెరవేర్చని తీరు బాధాకరమని ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం తోనైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకొని అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన విధంగా వికలాంగుల పింఛన్‌ను వెంటనే ?6,000కు పెంచాలని, అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్రంలో వికలాంగుల హక్కుల చట్టం 2016ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు,వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరుచేసి ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయాలని ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో చట్టం చేసిన తర్వాతనే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలని లేనిపక్షంలో ఎన్నికల హామీలన అమలు సాధన కోసం భువనగిరి నుంచే వికలాంగుల సంఘాల ఐక్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు.. ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కలెక్టరేట్ ముట్టడి




కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సమస్యలతో అల్లాడిపోతున్న వికలాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ముందుకు రావాలని డిమాండ్ చేశారు ఐక్య సంఘాల నాయకుడు కొడిదల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో, బిజెపి దివ్యాంగుల సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ గొల్లి ప్రభాకర్,ఎన్ పి ఆర్ డి ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లిఖార్జున్,ఐక్య సంఘాల నాయకులు మచ్చ ఉపేందర్,అనంతుల ఎల్లారెడ్డి,సింగారం రమేష్,జాగిలపురం అయిలయ్య,బండారి శివకుమార్,సిద్ధారెడ్డి,గుజ్జ అశోక్, గోగుయాదయ్య,ఆకుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యేకు వినతిపత్రం..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లా తాడ్వాయి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు



గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చిట్యాల బోర్ నుంచి తాడ్వాయి గ్రామం వరకు సుమారు 5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో మినీ స్టేడియం మంజూరు చేసి యువతలో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, మహిళా సంఘ భవనం మంజూరు చేయాలని కోరారు. తాడ్వాయి గుడి మాల్య చెరువు వద్ద సీసీ రోడ్డు, బెంచీల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ అభివృద్ధి కోసం వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ మండల అధ్యక్షుడు మేకల రాజు, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రంజీత్ కుమార్, కోశాధికారి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాండ్ కళాకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**- తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
ఆసిఫాబాద్, అక్టోబర్ 5: తెలంగాణ రాష్ట్రంలోని బ్యాండ్ వాయిద్య కళాకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి ఎమ్మర్ల శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో వేలాది మంది బ్యాండ్ కళాకారులు తమ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇతర ఆదాయ మార్గాలు లేకపోవడంతో అనేక బ్యాండ్ కళాకారుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బ్యాండ్ కళాకారులకు పూర్తిస్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు:1. ఇల్లు లేని బ్యాండ్ కళాకారులను ప్రత్యేకంగా సర్వే చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి.2. బ్యాండ్ కళాకారులకు సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేయాలి.3. అన్ని రకాల అనారోగ్యాలకు వర్తించే విధంగా ప్రత్యేక హెల్త్ కార్డులు అందించాలి.4. రోడ్డు ప్రమాదాలు, ఇతర



ప్రమాదాల్లో మరణించిన బ్యాండ్ కళాకారుల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక బీమా లేదా సంక్షేమ పథకాన్ని అమలు చేయాలి.5. ప్రతి జిల్లా కేంద్రంలో బ్యాండ్ కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలం కేటాయించా
17

# బొడ్డెమ్మలతో బతుకమ్మ పండుగకు నాంది..

**-నిజాంపేటలో ఘనంగా బొడ్డెమ్మ సంబరాలు**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు నాందిగా భావించే బొడ్డెమ్మ సంబరాలు మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని పలు



గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో గ్రామాల్లో ముందస్తు పండుగ సందడి నెలకొంది.బొడ్డెమ్మ పండుగలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఆచారాలను పాటిస్తున్నారు. పుట్టమన్నును తీసుకువచ్చి పీఠలుగా ఏర్పాటు చేసి అందంగా బొడ్డెమ్మలను తయారు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళలు ఆవు పేడతో బొడ్డెమ్మలను రూపొందించి ఇళ్లలో గోడలకు ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం బొడ్డెమ్మలను బతుకమ్మలతో కలిసి గ్రామ చెరువుల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ నిమజ్జనంతో తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా జరుపుకునే తొమ్మిది రోజుల బతుకమ్మ మహా సంబరాలకు శ్రీకారం చుడతారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పాటలు పాడుతూ బొడ్డెమ్మ చుట్టూ సందడి చేస్తున్నారు.

# సీసీ రోడ్డు పనుల ప్రారంభం

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని భజరంగ్ కాలనీలో రూ. 34 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలనీవాసుల దశాబ్దాల రోడ్డు కష్టాలను తీరుస్తూ, సుమారు 430 మీటర్ల పొడవునా ఈ సిమెంట్ రోడ్డును నిర్మించనున్నారు.ఈ పనులను జవహర్‌నగర్ మాజీ మేయర్, డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక నాయకులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముకేశ్, శోభారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగారెడ్డి మనోహర్ రెడ్డి, భజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రాసేన రావు, రాజేష్ గడ్డం, శ్రీనివాస్ గౌర, ఉపేందర్, అంగడి బాలరాజ్, నరేష్, అంగడి కృష్ణ, సుబ్బారావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ మరియు స్థానికులు మాట్లాడుతూ.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించి, నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని వారు కోరారు.

# 43 వ వార్డులో సిసి రోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



సూర్యాపేట పట్టణ మున్సిపల్ పరిధిలోని 43 వ వార్డులో ఈరోజు సోమవారం నాడు సిసి రోడ్ మరియు మురికి కాలువ నిర్మాణానికి పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మరియు కౌన్సిలర్ బత్తుల ఝాన్సీ లక్ష్మీ రమేష్ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వార్డులో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుందామని టౌన్ అభివృద్ధికి అందరం కలిసి సహకరించాలని మాట్లాడారు. కౌన్సిలర్ బత్తుల ఝాన్సీ లక్ష్మి రమేష్ మాట్లాడుతూ వార్డులో కొంచెం నీటి సమస్య అధికంగా ఉందని ప్రతి ఇంటి వారు బోర్లు వేయించుకోవడం జరిగిందని అయినా కూడా బోర్లు ఫుల్లుగా సక్సెస్ కాకపోవడం లేదన్నారు. నీటి ఎద్దడి ముందు కాలంలో చాలా ఎక్కువగా ఉంటుందని దాన్ని అధిగమించడానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని చైర్మన్ కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బత్తుల రమేష్, వార్డు నాయకులు శంకర్, రవి, వెంకన్న, బాలస్వామి, రాణి, బద్దం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
దీర్ఘకాలిక అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని కె.వెంకటాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి బాలమణి (55) గత తొమ్మిదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. అనారోగ్యానికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా సరిగా



లేకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి భర్త బాలరాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట ఎస్ఐ రాజేష్ తెలిపారు.